# వైద్యరంగం వ్యాధిగ్రస్తం

## 'డాక్టర్స్ డే' సాక్షిగా ప్రమాణాల పతనం



డాక్టర్ బి.సి.రాయ్

**ఒకప్పుడు ఎంతో ఉన్నతమైనదిగా గౌరవాభిమానాలు పొందిన వైద్యవృత్తి, నేడు నైతిక ప్రమాణాల పతనం కారణంగా అప్రతిష్ఠను మూటగట్టుకుంటోంది. ఈ దురవస్థనుంచి బయటపడి, వైద్యవృత్తికి మునుపటి ప్రాభవం చేకూర్చడమే డాక్టర్ బి.సి.రాయ్‌కు నిజమైన స్మృత్యంజలి అని నొక్కిచెబుతున్న వ్యాసమిది...**

అమాయక పేదలపై ప్రమాదకర ఔషధాలను ప్రయోగించిన ఘటన ఇటీవల మనరాష్ట్రంలో పెనుసంచలనం సృష్టించింది. దళారుల ప్రోద్బలంతో ఔషధ ప్రయోగాల కోసం హైదరాబాద్‌కు వెళ్లొచ్చిన గుంటూరు జిల్లా పిడుగురాళ్లలోని పలువురు పేదలు తీవ్ర అనారోగ్యం పాలుకావటం కలవరం కలిగించింది. వివిధ ఔషధ కంపెనీలు ప్రయోగ పరీక్షల పేరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పచ్చని జీవితాలతో చెలగాటమాడుతున్న తీరు- భయాందోళనలు రేకెత్తించింది. ఎప్పటికప్పుడు రకరకాల వ్యాధి బాధలు ముసురుకొంటూ ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్న నేపథ్యంలో, వాటిని దీటుగా ఎదుర్కొనేందుకు కొత్త ఔషధాలు కనుగొనే ప్రయత్నాలు స్వాగతించదగ్గవే. కానీ, కారుచౌకగా ఔషధ పరీక్షల తంతు ముగించేందుకు నిరుపేదల్ని పావులుగా ఉపయోగించుకోవడం ఆక్షేపణీయం. అది అసమంజసమే కాదు, అనైతికం కూడా. కొన్ని ఔషధ కంపెనీల నిర్వాకం, ఔషధ రంగంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న మనరాష్ట్రం ప్రతిష్ఠను మసకబారుస్తోంది. ఖమ్మం జిల్లాలో హెచ్‌పీవీ టీకా ప్రయోగంవల్ల నలుగురు బాలికలు మరణించారన్న ఆరోపణలు సర్దుమణగకముందే పిడుగురాళ్ల ఉదంతం బయటపడటం గమనార్హం. వెలుగుచూడని చీకటి కథలు మరెన్ని ఉన్నాయో? ఇలా ఎందుకు జరుగుతోంది? ఈ పెడపోకడకు అడ్డుకట్ట వేసేదెలా?

### దిగజారుతున్న ప్రమాణాలు

మనదేశంలో ఏటా జులై ఒకటో తేదీని డాక్టర్ల దినోత్సవంగా జరుపుకొంటారు. దేశం గర్వించదగ్గ వైద్యనిపుణుడు డాక్టర్ బి.సి.రాయ్‌కు స్మృత్యంజలిగా ఈ పండగ నిర్వహిస్తారు. ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, పశ్చిమ బెంగాల్ రెండో ముఖ్యమంత్రిగా 14 ఏళ్లపాటు సత్పరిపాలన అందజేసిన బి.సి.రాయ్- వైద్యరంగానికి చేసిన సేవలు అపారం. ఆయన జయంతీ, వర్ధంతీ ఇదే రోజు కావడం గమనార్హం. నిత్యజీవనంలో డాక్టర్ల పాత్రపై ప్రజల్లో అవగాహన కలిగించాల్సిన సందర్భమిది. సమాజానికి చికిత్సచేసే వైద్యుల సేవాదృక్పథాన్ని, అంకితభావాన్ని యావద్దేశం గుర్తించాల్సిన తరుణమిది. వైద్యవృత్తిలో నైతిక ప్రమాణాలు పాటించాల్సిన అవసరాన్ని డాక్టర్లూ గుర్తెరగాల్సిన సమయమిది.

పశ్చిమ దేశాల వైద్య పాఠ్యాంశాల్లో నైతిక నియమాలు అవిభాజ్యం. మనదేశంలోని వైద్య కళాశాలల్లో నేటికీ అవి సుదూరం. మారిన కాలమాన పరిస్థితుల్లో రోగులు డాక్టర్లమీద నమ్మకం కోల్పోతున్నారు. అందుకే, తరచూ డాక్టర్లను మారుస్తున్నారు. మంచి డాక్టరు ఎవరో, తనకు బతుకుమీద భరోసా ఎవరు ఇవ్వగలరో సులభంగా కనుగొనలేకపోతున్నారు. చివరకు పెద్దగా నైపుణ్యంలేని డాక్టరు వలలో చిక్కి, ఉసూరుమంటున్నారు. ఈ రోజుల్లో మన దేశంలో మంచి డాక్టరును వెతికిపట్టుకోవడమంటే లాటరీలో మొదటి బహుమతి గెలుచుకొన్నట్లే! ఎంత దురదృష్టకరమైన పరిస్థితి ఇది!

పిడుగురాళ్ల వంటి ఘటనలు, వైద్యులపట్ల, వైద్యవృత్తి పట్ల ప్రజల్లోగల గౌరవాభిమానాల్ని మరింతగా దిగజారుస్తున్నాయి. కొంతమంది స్వార్థంతోపాటు గట్టి నియమ-నిబంధనలు, నియంత్రణలు, జవాబుదారీతనం, కఠినచట్టాలు కొరవడటంతో సమాజంలోని పేదవర్గాలవారు అనైతిక ఔషధ పరీక్షలకు ఎరలవుతున్నారు. ఎంత దారుణ దురవస్థ ఇది!

వైద్యవృత్తిని ఒకప్పుడు ఎంతో ఉన్నతమైనదిగా పరిగణించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నేడు దేశంలో వైద్యం వ్యాపారమయమై, అవినీతికి ఆలవాలంగా మారింది. వైద్యవృత్తికి సంబంధించిన అన్ని విభాగాల్లోనూ అనైతిక విధానాలు చొరబడ్డాయి. కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలలు డొనేషన్లే కాకుండా అభ్యర్థులనుంచి నల్ల డబ్బూ స్వీకరిస్తున్నాయి. కొందరు వైద్య విద్యార్థులు భారీగా డబ్బులు ముట్టజెప్పి ఉత్తీర్ణులవుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. వ్యాధి నిర్ధారణ (డయాగ్నొస్టిక్) పరీక్ష కేంద్రాలనుంచి ముడుపులు స్వీకరించి, అవసరం ఉన్నా, లేకపోయినా రోగులకు వైద్య పరీక్షలు చేయించడం, ఫలానా చోట పరీక్ష చేయించుకొంటేనే రోగిని చూస్తామని హెచ్చరించడం ఇటీవలికాలంలో డాక్టర్లకు మామూలైపోయింది. కొన్ని బడా ఆస్పత్రులవారు ఆరోగ్యశ్రీ వంటి ఉచిత వైద్య సేవలకు సైతం ఇదే సూత్రాన్ని వర్తింపజేస్తూ, పేద రోగుల చేత సొంత ఖర్చుతో అనవసరమైన, ఖరీదైన వైద్య పరీక్షలు చేయిస్తుండటం మరింత దారుణం. ఔషధ తయారీ కంపెనీలనుంచీ ముడుపులు పుచ్చుకొని, ఆ కంపెనీలు తయారుచేస్తున్న ఔషధాలనే రాస్తున్నారు. అవి నిజంగా అవసరమా కాదా అనే విచక్షణ కొరవడింది. 'వైద్యో నారాయణో హరీ' అన్నారు. వైద్య నారాయణుల దగ్గరికెళ్తే ప్రాణాలు హరీమనే పరిస్థితి వస్తోంది. మనదేశంలో వైద్యవృత్తిలో నైతిక ప్రమాణాలు ఇదివరకెన్నడూ లేనంతగా దిగజారాయనడం నిస్సందేహం!

అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణపై నిరుడు భారత వైద్యమండలి (ఎంసీఐ) అధ్యక్షుణ్ని అరెస్టు చేశారు. ప్రమాణాలు ఏ స్థాయిలో పతనమయ్యాయో చెప్పడానికి ఈ ఉదంతమే తిరుగులేని నిదర్శనం. ఎంసీఐలో ఏ పదవికైనా విశ్వసనీయత, సామర్థ్యం, సేవాభావం కలిగినవారినే ఎన్నుకోవాలి. నిజాయతీపరులు, నిబద్ధత కలిగిన డాక్టర్లను ఎన్నికల్లో నిలబెట్టి, గెలిపించుకోవాలి. ఇప్పుడు అలా జరుగుతోందా అంటే, కచ్చితంగా అవునని చెప్పే పరిస్థితి లేదు. నిర్ధారిత విధి-విధానాలు, ప్రమాణాలకు అనుగుణంగా వైద్యం, శస్త్రచికిత్సలు చేస్తున్న డాక్టర్లూ తక్కువే. దాంతో రోగులకు తీవ్ర వ్యయప్రయాసలు తప్పడం లేదు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, కొందరు ప్రముఖ డాక్టర్లు నెలజీతాలపై ప్రత్యేకంగా కొంతమంది మార్కెటింగ్ సిబ్బందిని నియమించుకొని, ఏదో విధంగా రోగుల్ని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. వ్యాధులు, వాటి నిర్ధారణ, చికిత్స పద్ధతులపై పత్రికలు, టీవీ, రేడియోల్లో అభిప్రాయాలు తెలియజేసి, జనజాగృతికి ప్రయత్నించడంలో తప్పులేదు. ఉద్దేశపూర్వకంగా మీడియా ద్వారా ప్రచారం చేసుకోవడం మాత్రం కచ్చితంగా అనైతికమే. నియంత్రణలేమీ లేకపోవడంవల్లే ఇలాంటి వ్యాపారాత్మక ధోరణి పెరిగిపోతోంది. వైద్య ప్రమాణాల విషయంలో రాజీపడటమంటే రోగుల ప్రాణాలతో చెలగాటమాడటమే. దేశంలోని చాలా ప్రాంతాల్లో ఇప్పుడు జరుగుతున్నది అదే!

మనదేశంలో వైద్యరంగంలో పరిశోధనలు అంతంత మాత్రమే. ఇక్కడి వైద్యశాస్త్ర పాఠ్య ప్రణాళికలో పరిశోధనలకు అసలు చోటులేదు. దాంతో పరిశోధనలకు సంబంధించి మన డాక్టర్లకు ఉండే పరిజ్ఞానం చాలా తక్కువ. వైద్య పత్రికల్లో వారు ప్రచురించే పరిశోధన పత్రాలూ అంతంత మాత్రమే. ఏవోకొన్ని పరిశోధనలు ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రం చేస్తుంటారు. వారి అనైతిక పరీక్షలకు అమాయకులైన పేదరోగులు బలిపశువులవుతుంటారు. డాక్టర్లు రాస్తున్న మందుల మంచి చెడ్డలు విద్యావంతులకు సైతం తెలియని పరిస్థితి ఉండటం విషాదకరం.

భారత వైద్యరంగంలో ఇలాంటి స్థితిగతులు నెలకొన్నాయి కనుకే, విదేశాలు వైద్య పరీక్షల కోసం ఇండియాను ప్రయోగశాలగా వాడుకొంటున్నాయి. బహుళజాతి కంపెనీలు చవగ్గా ఈ పరీక్షలు నిర్వహించడం ద్వారా భారీగా లాభపడుతున్నాయి. విదేశాల్లో ఇలాంటి ప్రయోగపరీక్షలకు సిద్ధపడే రోగులు పెద్దగా ఉండరు. పైగా కఠిన నియమ నిబంధనలు అనుసరించవలసి ఉంటుంది. భారీగా పరిహారం చెల్లించవలసి వస్తుంది. అంతేకాదు- ప్రయోగ పరీక్షల ప్రతిపాదనలను నైతిక ప్రమాణాల కమిటీకి పంపి, ఆమోదం పొందవలసి ఉంటుంది. కమిటీ కాదంటే పరీక్షల యోచనను విరమించుకోవలసిందే. మనదేశంలో అలాంటి బాదరబందీలేమీ లేవు. ఇక్కడ ప్రయోగ పరీక్షలకు అంగీకరిస్తున్నవారికి తగినంత పరిహారం చెల్లిస్తున్న దాఖలాలూ లేవు. పరీక్ష సందర్భంగా రోగి అస్వస్థతకు గురైనా, లేక మరణించినా పరిహారం చెల్లించాలని భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) మార్గదర్శక సూత్రాలు స్పష్టం చేస్తున్నా, వాటిని పట్టించుకొనేవారు లేరు. ఆ రోగులకు బీమా వర్తింపజేయడంలేదు. ఏవో కొన్ని నియమాలు ఉన్నా, నియంత్రణ యంత్రాంగాన్ని డబ్బుతో లోబరచుకోవడం మనదేశంలో చాలా సులభం. విదేశీ ఔషధ కంపెనీల ప్రాణాంతక క్రీడ అడ్డూ ఆపు లేకుండా సాగిపోవడానికి ఇదో ముఖ్య కారణం. ఈ దుస్థితినుంచి దేశం బయటపడేదెలా?

### పరిష్కార మార్గాలివి...

మనసుంటే మార్గం ఉంటుంది. మనసుపెట్టి ఆ మార్గంలో సాగిపోతే ఎలాంటి అవాంతరాలనైనా సునాయాసంగా అధిగమించవచ్చు. ప్రతికూల పరిస్థితుల్ని సానుకూలంగా మలచుకొని, లక్ష్యం చేరుకోవచ్చు. అందుకోసం ఇప్పుడు మనకు కావలసింది నవచైతన్యం, దృఢచిత్తం, స్థిర సంకల్పం. పరిస్థితి పూర్తిగా చేయిదాటక ముందే ప్రభుత్వం మేలుకొని, దిద్దుబాటు చర్యలకు పూనుకొంటేనే సత్ఫలితం సాధ్యమంటున్న ప్రముఖ వైద్య నిపుణులు, కిమ్స్-ఉషాలక్ష్మి ఆస్పత్రి డైరెక్టర్, కన్సల్టెంట్ ఆంకోప్లాస్టిక్ బ్రెస్ట్ సర్జన్ అయిన డాక్టర్ పి.రఘురామ్, ప్రస్తుత సమస్యకు కొన్ని పరిష్కారాలూ సూచించారు. ఆయన సూచనల ప్రకారం మనదేశంలోని వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్‌తో పాటు వైద్య పీజీ కోర్సుల పాఠ్యాంశ ప్రణాళికలో పరిశోధన అన్నది భాగంగా ఉండాలి. పరిశోధనలో శిక్షణ పొందని, వైద్యపత్రికల్లో పరిశోధన పత్రాలు ప్రచురించని డాక్టర్లను వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అనుమతించరాదు. పరిశోధన పద్ధతిపై దేశమంతటా కోర్సులు నిర్వహించాలి. ఆ కోర్సులు పూర్తి చేసిన డాక్టర్ల సామర్థ్యాన్ని అంచనా వేశాకే, వైద్య పరీక్షల్లో పాలుపంచుకొనేందుకు అనుమతించాలి. ప్రభుత్వ విభాగాల్లోనైతేనే తనిఖీలు, నియంత్రణలకు అవకాశం ఉంటుంది. అందువల్ల, పరిశోధనలను వారికే పరిమితం చేయాలి. ప్రధాన పరిశోధకుల పనితీరు మచ్చలేనిదని నియంత్రణ సంస్థ నమ్మిన పక్షంలోనే ప్రైవేటు సంస్థల్లో పరిశోధనలకు అనుమతించాలి. వైద్య పరిశోధనలు పూర్తిగా మనదేశ అవసరాలకు అనుగుణంగా జరగాలి. వాటివల్ల మనదేశంలోని రోగులకు మాత్రమే ప్రయోజనం కలగాలి. పశ్చిమ దేశాల్లోని రోగులకు ఉపయోగపడే వైద్య పరిశోధనల్ని మనదేశంలో నిర్వహించేందుకు ఎట్టిపరిస్థితుల్లో అవకాశం ఇవ్వరాదు. వైద్యప్రయోగపరీక్షల సందర్భంగా మానవహక్కుల ఉల్లంఘనలకు అవకాశం లేకుండా చూడాలి. రోగులకు ముందుగానే అన్ని వివరాలు తెలిపి, వారి ఆమోదం తీసుకోవాలి. తగినంత పరిహారం చెల్లించాలి. బహుళజాతి కంపెనీ జరిపే పరిశోధన ఫలప్రదమైతే, ఆ ఔషధాల్ని పశ్చిమ దేశాల రేట్లకు కాకుండా, మనదేశంలో మన ప్రజలు భరించగలిగే ధరలకు విక్రయించేలా చూడాలి. వీటితోపాటు, నైతిక విలువలు దిగజారకుండా చూసే సరైన నియంత్రణ వ్యవస్థలు ఉంటేనే దేశ వైద్యరంగం బాగుపడుతుంది.

– కేశవ